సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు

1,201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

- ఎన్నికల కమిటీలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి
- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 1,201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు, అందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల నిర్వహణకు బాధ్యతలు అప్పగించిన అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,201 వెబ్ కాస్టింగ్‌తో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం నియమించిన కమిటీలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, నాటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఎంసీసీ బృందాలు నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అన్ని చెక్ పోస్టుల్లో మరింత నిఘా ఉంచాలని, జిల్లాలో అక్రమ మద్యం, నగదు, బంగారం ఇతర వస్తువులు రాకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో విడుత ర్యాండమైజేషన్ 18న చేపడుతామని, జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో పోలీస్, సెక్టార్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పకడ్బందీగా చేపట్టాలి

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నియమించిన బృందాలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సిబ్బంది, ఇతర అధికారులు 7,194 మంది ఉన్నారని వారితో పాటు 85 సంవత్సరాలు పైబడిన వారు 6,070 మంది 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు 16,949 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్‌డీఓలు సూర్యనారాయణ, వేణుమాధవ్, శ్రీనివాస్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధాన్యం కొనుగోలు, చెల్లింపులు, మౌలిక వసతులపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్.లతతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 32,305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.5.50 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే ట్యాగింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు సైతం అదే రోజు చేపట్టాలని తెలిపారు. ఎండ తీవ్రత, అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని ధాన్యం తడవకుండా జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎస్ఓ మోహన్ బాబు, డీఎంఓ నాగేశ్వర్‌శర్మ, డీఎం సివిల్ సప్లయ్ రాములు పాల్గొన్నారు.

వాతావరణ మార్పుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

వాతావరణంలో వస్తున్న మార్పుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి వడదెబ్బపై సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండలకు తోడు వడగాల్పులు అధికమవుతున్నాయన్నారు. ప్రజలు ఎండ నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. ప్రతి మండలంలో మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ బారిన పడిన వారికి చికిత్స చేయడానికి సూర్యాపేట మెడికల్ కాళాశాల జనరల్ ఆస్పత్రిలో ఐదు పడకలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డీడబ్ల్యూఓ వెంకటరమణ, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు డాక్టర్ వెంకటరమణ, వైద్యులు కళ్యాణ్‌చక్రవర్తి, కుమారస్వామి, నిరంజన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

19 నుంచి కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 16 : నూతన రామాలయ నిర్మాణంతో నేరేడుచర్లలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. స్థానిక తాసీల్దార్ కార్యాలయం సమీపంలో దాతల సహకారంతో సుమారు రూ.2 కోతో నిర్మించిన కోదండ రామాలయంలో ఈ నెల 19 నుంచి 21 వరకు విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతిష్ఠ మహోత్సవాలకు నేరేడుచర్ల పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

నేడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం సూర్యాపేట మార్కెట్‌యార్డు, కార్యాలయానికి సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమీషన్‌దారులు, రైతులు విషయాన్ని గమనించి బుధవారం మార్కెట్‌కు సరుకులు తీసుకురావొద్దని కోరారు.

దోసపహాడ్ సీతారామంజనేయాలయంలో పూజలు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16 : మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామ సీతారామాంజనేయస్వామి దేవాలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా కలిసి దేవాలయ చైర్మన్ దొంగరి జానకిరామయ్య ఆధ్వర్యంలో వెంకటరమణ, సత్యనారాయణ, గిరి అయ్యగార్లతో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగందర్ స్వాతి దంపతులు, లంకలపల్లి వెంకటాచారి, చింతల శ్రీరాములు, దొంగరి బొనయ్య, దొంగరి ఉపేందర్, కర్ణం గురువయ్య, కెత్తె చైతన్యరాజు,

దొంగరి శ్రీకాంత్, దొంగరి సందీప్, బారి కాశయ్య, శిరస్సు రాంబాబు దంపతులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

శాలిగౌరారం, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ అన్నారు. మండలంలోని మాధారం కలాన్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రజలకు, రైతులకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ కాలయాపన చేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నందున మళ్లీ రైతులను మభ్యపెట్టేందుకు ఆగస్టులో రుణమాఫీ చేస్తానడం హాస్యాస్పందంగా ఉందన్నారు. కల్యాణలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, మామిడి సర్వయ్య, కట్టా వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, జెర్రిపోతుల చంద్రగౌమాళిగౌడ్, గుజిలాల్ శేఖర్‌బాబు ఉన్నారు.

జీవాల వలసలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి
- ప్రథమ చికిత్స మందులను వెంట తీసుకెళ్లాలి
- అనారోగ్యంతో ఉన్న జీవాలను ప్రత్యేకంగా మేపాలి

మేత కోసం జీవాలను తరలిస్తున్న కాపరి

గరిడేపల్లి, ఏప్రిల్ 16 : జీవాల పెంపకం చేపట్టే వారు ఒకేచోట మేపడానికి సరిపడా మేత లభ్యం కానప్పుడు మందలను ఇతర ప్రాంతాలకు తొలుకపోతుంటారు. సాధారణంగా ఎండాకాలంలో మేత దొరకక ప్రతి రోజూ జీవాలను మేపుతూ వందల కిలోమీటర్ల కొద్ది వలసలు వెళ్తుంటారు పెంపకందారులు. ఇలా వెళ్లేప్పుడు తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా జీవాలకు ఏ విధమైన హాని కలుగకుండా అనుకున్న చోటికి చేరడమే కాకుండా ఆరోగ్యంగా పెరగడంతో వాటి ద్వారా మంచి లాభాలను గడించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జీవాలు వలస వెళ్లేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు.

వలస వెళ్లే జీవాలకు ఎదురయ్యే సమస్యలు..

- సరైన మేత లభించకపోవడం, ఆహారంలో మాంసకృత్తులు లోపించడం వల్ల మాంసోత్పత్తి అంతంత మాత్రమే ఉంటుంది
- శక్తి లోపం వల్ల పునరుత్పత్తి లోపం ఏర్పడుతుంది. పోట్లెళ్లలో మరణాల శాతం ఎక్కువ కనబడుతుంది
- టీకాలు, పునరుత్పత్తి మొదలగు కార్యక్రమాలను అమలు చేయడం కష్టం
- అడవి జంతువులు, దొంగల బెడద, వాహనాల వల్ల ప్రమాదాలు మొదలగు కారణాల వల్ల నష్టం సంభవించే అవకాశం
- ఖనిజ లవణాలు (కాల్షియం, ఫాస్పరస్, కాపర్, ఇనుము మొదలైనవి) లోపిస్తాయి

జీవాలు పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- జీవాలు వలస వెళ్లేముందు అన్నింటికీ పేడ పరీక్ష చేయించి నట్టల మందులు తాపించాలి
- జీవాలకు చిటిక రోగం, గాలికుంటు మొదలైన వ్యాధుల నివారణకు ముందే టీకాలు వేయించుకుని బయల్దేరాలి
- జీవాలతో వెళ్లేవారు జీవాల ప్రథమ చికిత్సకు కావాల్సిన మందులను వెంట తీసుకువెళ్లాలి. టింక్చర్ అయోడిన్, పొటాషియం పర్మాంగనేట్, యాంటీబయాటిక్, జ్వరం, నొప్పి తగ్గించే మాత్రలను హిమాలయన్ బత్తిసా, నెబ్లాన్, సిరంజిలు, దూది మొదలయినవి అవసరం ఉంటాయి
- వలస వెళ్లిన ప్రాంతాల్లో జీవాలకు సమస్యలు ఎదురైతే ప్రభుత్వ పశు వైద్య అధికారుల సలహాలు తీసుకోవాలి. వాడిన మందుల వివరాలను రాసి ఉంచుకుని పశు వైద్యులకు చూపించాలి
- ఉదయం మంద మేతకు బయల్దేరే ముందు సాయంత్రం మంద ఒక దగ్గర చేరిన తర్వాత జీవాలను ఒక పావు గంట జాగ్రత్తగా పరిశీలించాలి. అనారోగ్యంగా ఉన్న జీవాలను, గాయాలైన జీవాలను, చూడి జీవాలను గమనించి చికిత్సలు చేయాలి
- ఖనిజ లవణాల లోపాల నివారణకు అప్పుడప్పుడూ రాళ్ల ఉప్పు జల్లితే జీవాలు నాకుతుంటాయి
- పిల్లల్ని పెద్ద జీవాలతో పాటు సమానంగా నడిపించకూడదు. అవసరమైతే వాటిని ఎత్తుకోవాలి
- మందలో మేత మేయని, మందలో వెనుకబడే జీవాల్ని గమనిస్తూ వాటికి ఆకులు, రెమ్మలు కోసి ప్రత్యేకంగా అందించాలి
- కొన్ని ప్రాంతాల్లో హానీ కలిగించే మొక్కలుంటాయి. వాటిని జీవాలు తిన కుండా శ్రద్ధ వహించాలి
- అనారోగ్యంగా కనిపించే జీవాలకు జావ, అంబలి, అరటిపండ్లు తినిపించి సంరక్షిస్తూ తక్కువ రేటుకు జీవాలను అమ్ముకోకుండా వైద్యం చేయించాలి
- రాత్రి వేళల్లో జీవాల రక్షణకు వలలు, తడికలు, జాలిలు వాడాలి. లేదా అవకాశం ఉన్నచోట తాళ్లతో కట్టేయాలి. దొంగలు, అడవి జంతువుల నుంచి జీవాలను రక్షించుకోవాలి.

పరిశీలన తర్వాతే వలస వెళ్లాలి

జీవాలను మేత కోసం ఒకచోటు నుంచి మరొక చోటుకు తోలుకుని వెళ్లేప్పుడు తప్పనిసరిగా ప్రత్యేకంగా పరిశీలించాలి. వలస వెళ్లేప్పుడు ప్రథమ చికిత్స మందులను తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలి. జీవాలలో ఏమైనా రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించి తగిన చికిత్సలు చేయించుకోవాలి. అనారోగ్యంగా ఉన్న జీవాలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతూ మేతను ప్రత్యేకంగా వేయాలి. రాత్రి వేళల్లో జాగ్రత్తలు తీసుకుంటుండాలి. అలా చేస్తేనే జీవాల పెంపకందారులు ఆశించిన లాభాలను పొందగలుగుతారు.

- సీహెచ్.నాగేంద్ర, పశు వైద్యాధికారి, గరిడేపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాగారం మండలాధ్యక్షుడు ఉప్పలయ్య

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ నాగారం మండలాధ్యక్షుడు ఉప్పలయ్య

నాగారం, ఏప్రిల్ 16 : అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాగారం మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ 19న బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ జాజిరెడ్డిగూడెం మండలంలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కావునా మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు దోమల బాలమల్లు, అధికార ప్రతినిధి చిల్లర చంద్రమౌళి, యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్‌కుమార్, కూరం వెంకన్న, మధుసూదన్ రెడ్డి, రాములు, మహేందర్, అంజయ్య, మల్లేశ్, యాదగిరి పాల్గొన్నారు.

మట్టపల్లి గోశాలకు వరిగడ్డి అందజేత

గరిడేపల్లి, ఏప్రిల్ 16 : మండల కేంద్రానికి చెందిన పెండెం సైదులు, రమణ దంపతులు మట్టపల్లి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ గోశాలకు ట్రాక్టర్ ట్రక్కు వరిగడ్డిని ఉచితంగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో చెవుల సోమయ్య, రాంబాబు, వెంకన్న, రాధమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల వేణుగోపాల లక్ష్మీనరసింహ ఆలయంలోని గోశాలకు బేతవోలుకు చెందిన కొండా వెంకయ్య, అచ్చమ్మ, నల్లగొండకు చెందిన వీరవెల్లి శ్రీహరి 100 మోపుల పశుగ్రాసం, తవుడు కట్టలను అందజేశారు.

దిర్శించర్ల వాసి రాజుకు ఓయూ డాక్టరేట్

నేరేడుచర్ల, ఏప్రిల్ 16 : నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన చిట్యాల రాజు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. సైఫాబాద్ సైన్స్ కళాశాలలో కంప్యూటర్ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఆయన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డాక్టర్ ఏవీ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్, డాటా సెక్యూరిటీ విషయంలో ఎదురయ్యే సవాళ్లను మిషన్ లెర్నింగ్ సహాయంతో ఎలా ఎదుర్కోవచ్చు అనే అంశంపై జరిపిన పరిశోధనకుగానూ ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మానాయక్, కంప్యూటర్ విభాగం సహా, అధ్యాపకులకు, డిపార్ట్‌మెంట్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

చిల్లేపల్లి ఊర చెరువులో పూడికతీత పనులను ప్రారంభించిన ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి

ఊర చెరువు పూడికతీత పనులు ప్రారంభం

నేరేడుచర్ల, ఏప్రిల్ 16 : రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి పనికి వచ్చే కూలీలు పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లేపల్లి ఊర చెరువులో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పూడికతీత పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. చెరువులో మట్టి కావాల్సిన రైతులు తమ సొంత వాహనాల్లో ఉచితంగా తీసుకుపోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్ అజీమ్ బాషా పాల్గొన్నారు.

వడగాడ్పులతో అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి పుష్పలత

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 : వడగాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి పుష్పలత అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసి మాట్లాడారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కార్మికులకు వివరించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం 10 గంటల వరకు అలాగే సాయంత్రం 4 తర్వాత పని చేయాలన్నారు. ప్రజలు తరుచుగా మంచినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నూర్జహాన్ బేగం, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల పరిధిలోని మర్రి కుంటతండాలో ఉపాధి హామీ కూలీలకు పీహెచ్‌సీ డాక్టర్ వందన వడదెబ్బపై అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇటుకల బట్టీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

మోతె : వడదెబ్బకు గురికాకుండా ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్‌వైజర్ కమలమ్మ అన్నారు. మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, పోస్ట్‌ఆఫీస్, రేషన్ డీలర్ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి, జయసుధ, సుచరిత, స్వాతి, ఉమ, లలిత పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

మహిళ లకు ఆరోగ్య పరీక్షలు

నూతనకల్, ఏప్రిల్ 16 : ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 21 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 12 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ

ఎస్సీ కాలనీ మంచినీటి సమస్య పరిష్కారం

మునుగాల, ఏప్రిల్ 16 : మండల పరిధిలోని నర్సింహులగూడెం ఎస్సీకాలనీలో మంచినీటి సమస్య ఏర్పడగా విషయాన్ని స్థానికులు గురువారం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సత్యనారాయణ సమీపంలోని ప్రైవేట్ బోరు లీజుకు తీసుకున్నాడు. 40 పైపులతో పనులు నిర్వహించి కాలనీకి నీటిని సరాఫరా చేసి సమస్యను పరిష్కరించారు.

అంబేద్కర్‌ను గౌరవించకపోవడం శోచనీయం

- బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీశ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీశ్

పాలకవీడు, ఏప్రిల్ 16 : హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో గతేడాది నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ ఏడాది అంబేద్కర్ జయంతి ఉత్సవాలను కాంగ్రెస్ ప్రభుత్వం జరుపకపోవడం అంబేద్కర్‌ను అవమానించడేమనని అన్ని ప్రజా సంఘాలు భావిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ మీద కోపంతో అంబేద్కర్ విగ్రహ సందర్శనకు సైతం అనుమతి ఇవ్వకపోవడం, గేట్లకు తాళం వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంబేద్కర్‌ను అవమానపరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మంద నాగయ్య కరుణాకర్, సైదులు, ప్రసాద్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి..అహంకారం తగ్గించుకో

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్

నకిరేకల్, ఏప్రిల్ 16 : సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ భిక్షం పెట్టింది మాదిగలేనని..నిజం కాదని చెప్పే దమ్ముందా రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా అహంకారాన్ని తగ్గించుకోవాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీని మాదిగలే బొంద పెడతారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నకిరేకల్ పట్టణంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయభిక్ష పెట్టింది మాదిగలేనని స్వయంగా ఆయనే పలు వేదికలపై చెప్పి, ఇప్పుడు ఎమ్మార్పీఎస్ ఉద్యమంపై, మందకృష్ణ మాదిగపై విమర్శిస్తున్నాడన్నారు. మాదిగలపై తన మనసులో నింపుకున్న విషాన్ని ఒక్కొక్కటిగా బయటకు కక్కుతున్నాడన్నారు. మాదిగలను మోసం చేసినందుకు ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని, రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి వంగూరి ప్రసాద్, నాయకులు మాచర్ల వెంకట్, జిల్లా ప్రశాంత్, వంగూరి నరేశ్, మాచర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

మోతె, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ కార్యకర్త, మండలంలోని బీక్యాతండాకు చెందిన బానోతు భంగ్యా అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులు సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. భంగ్యా మృతి పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట నాయకులు బానోతు బాబూనాయక్, దేవ్లానాయక్, సైదులు, వెంకన్న ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి

- ఎస్ఈ చంద్రమోహన్

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 16 : వేసవి విద్యుత్ ఉద్యోగులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ సూచించారు. హైదరాబాద్ యశోధ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 225 మంది ఉద్యోగులకు పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ నవీద్ అహ్మద్,1104 యూనియన్ నాయకులు వెంకటయ్య, 327 యూనియన్ కార్యదర్శి సురేశ్ కుమార్, డాక్టర్లు ఉన్నారు.

దక్కన్ ఫ్యాక్టరీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

దక్కన్ ఫ్యాక్ట